
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

కాకినాడ
జిల్లా వార్తలు

సోమవారం 4 మార్చి 2024 | 5



9, 10న కాకినాడలో అఖిల భారత తెలుగు సాహితీ సదస్సు

గౌతమి ఎక్స్‌ప్రెస్ రైలుకు ఎల్‌హెచ్‌బీ బోగీలు

కాపర్ చోరులు



పెద్దాపురం మండలం ఆర్‌బీ పట్నంలో ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్‌ను చోరీ చేసిన దృశ్యం (ఫైల్)

ఇటీవల పెద్దాపురం మండలం రాయభూపాల పట్నంలో ఉన్న పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్‌లోని విలువైన రాగితీగ చోరీకి గురైంది. గత మూడు నెలల వ్యవధిలో గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి ట్రాన్స్‌ఫార్మర్లకు విద్యుత్ కనెక్షన్ తొలగించి అందులో రాగి వైరును అపహరించుకుపోయారు. ఇటీవల గండేపల్లి మండలంలో అర్ధరాత్రి సమయంలో ఒకేరోజు రాత్రి ఐదు ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి తీగను దొంగిలించారు. దీనిపై పోలీసులకు సైతం ఫిర్యాదు అందింది.

- పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మాయం
- అందులో రాగి వైరును చోరీ చేస్తున్న దొంగలు
- ప్రాణాంతకమని తెలిసినా బరితెగింపు
- ముఠాలుగా ఏర్పడి యథేచ్ఛగా దొంగతనాలు

పెద్దాపురం, మార్చి 3: ఇటీవల జిల్లావ్యాప్తంగా పలుచోట్ల ఇలా పంట పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురవుతున్నాయి. ఏటా రబీలో పంట పొలాలకు నీరు అందించేందుకు రైతులు మోటార్లు అమర్చుతుంటారు. అర్ధరాత్రి పొలాల్లో దొంగలు చొరబడి వాటిని అపహరిస్తున్నారు. విద్యుత్ వైర్లను తొలగించి అందులో కాపర్(రాగి) దొంగిలించి విక్రయిస్తున్నారు. చీకట్లో విద్యుత్ వైర్లను కట్ చేయడం ప్రాణాంతకమని తెలిసినా వెనక్కి తగ్గడం లేదు. ప్రస్తుతం వ్యవసాయానికి ఏడు గంటలు విద్యుత్ మాత్రమే సరఫరా ఉంటోంది. అది కూడా రెండు విడతలుగా అందిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. దీంతో విద్యుత్, రైతులు లేని సమయాల్లోనే దొంగలు చోరీలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. జిల్లావ్యాప్తంగా వందల సంఖ్యలో దొంగతనాలు జరిగినా కొన్ని మాత్రమే వెలుగులోకి వస్తున్నాయి. ప్రధానంగా దుండగులు పొలాల్లోని పాత ట్రాన్స్‌ఫార్మర్లను టార్గెట్ చేస్తున్నారు. పదేళ్ల కిందట ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చగా వాటిలో 14 కిలోల కాపర్ వస్తోంది. మార్కెట్‌లో కిలో కాపర్ ధర రూ.2,500 పలుకుతోంది. దీంతో ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ చోరీ చేస్తే రూ.30వేలకు పైనే సొమ్ము చేసుకోవచ్చని దొంగలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కాపర్‌ను బరంపురం, కటక్, జైపూర్ వంటి ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయిస్తున్నట్లు సమాచారం. చోరీలనుంచి కాపర్ కొనుగోలు చేసే వరకూ ఒక్కో ముఠా నడుస్తున్నట్లు తెలుస్తోంది.

రైతులకు ఇబ్బందులే..

సాధారణంగా 25 కేవీ విద్యుత్ టాన్స్‌ఫార్మర్ విలువ రూ.4లక్షల వరకూ ఉంటుంది. దానిలో కాపర్ విలువ రూ.70వేల వరకూ ఉంటుంది. కాపర్ చోరీ అవుతుండడంతో దాని కంటే తక్కువ ధరకు లభించే అల్యూమినియాన్ని విద్యుత్‌శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లలో అమర్చుతున్నారు. కాగా ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ కారణంగా రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. దొంగలు విద్యుత్‌వైర్లు ప్రమాదకరంగా కట్ చేసి అలానే వదిలేస్తుండడంతో రైతులు పొరపాటున వాటిని తాకితే ప్రమాదాలు తప్పని పరిస్థితి. పదుల సంఖ్యలో రైతులు డబ్బులు వేసుకుని ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకున్న పరిస్థితులు జిల్లాలో ఉన్నాయి. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు రైతు రాయితీపోను రూ.80వేల వరకూ కట్టాల్సి ఉంటుంది. ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురైతే సాగునీటి ఇబ్బందులతోపాటు తమపై అదనపు భారం పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పోలీస్‌శాఖ ప్రత్యేకంగా దృష్టిసారించిన దాఖలాలు కనిపించడం లేదు.

ప్రమాదాలకు అవకాశం..

పొలాల్లో వ్యవసాయ బోర్లకు సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్లు దొంగిలించడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్తది అమర్చేసరికి చాలారోజులు పడతాయి. ఇంతలో పంటలు పూర్తిగా ఎండిపోతాయి. విద్యుత్‌వైర్లు కత్తిరిస్తుండడంతో ప్రమాదాలు కూడా జరిగే అవకాశం ఉంది. ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి పాల్పడుతున్నవారిని పోలీసులు అరెస్టు చేయాలి.

-కె.రామ్మూర్తి, రైతు, ఆర్‌బీ పట్నం

శివరాత్రికి.. సిద్ధం



- మహాశివరాత్రికి ముస్తాబవుతున్న పాదగయ
- 6నుంచి కుక్కుటేశుని కల్యాణోత్సవాలు
- స్వయంభూ క్షేత్రాలకు నెలవుగా పాదగయ క్షేత్రం
- 8లక్షలకు పైగా భక్తులు వస్తారని అంచనా

పిఠాపురం, మార్చి 3: పాదగయ మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతోంది. ఏటా మహాశివరాత్రి పర్వదినాల్లో ఆరురోజులపాటు జరిగే స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాలకు దేశవ్యాప్తంగా ఉన్న భక్తులు తరలివస్తూ ఉంటారు. ఇందుకుగాను ఏర్పాట్లు చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు నిమగ్నమయ్యారు.

పిఠాపురం పాదగయ క్షేత్రంలో స్వయంభూగా దివ్య స్ఫటిక లింగమూర్తిగా వెలసిన కుక్కుటేశ్వరస్వామి, స్వయంభు దత్తాత్రేయస్వామి(విగ్రహమూర్తి రూపంలో ఉన్న ఏకైక క్షేత్రం), అష్టాదశ శక్తి పీఠాల్లో దశమ పీఠాధిపతి అయిన పురుహూతికాఅమ్మవారు, ఆదిశంకరాచార్యస్వామి ప్రతిష్ఠించిన రాజరాజేశ్వరీదేవి కొలువై ఉన్నారు. ఏటా మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పాదగయ పుష్కరణిలో స్నానాలు ఆచరిస్తే పాపాలు హరించి మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం. స్నానాలు ఆచరించిన తర్వాత పితృదేవుళ్లకు పిండ ప్రదానాలు(మూసివాయినాలు) నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. వీటిని నిర్వహించేందుకు దేశంనలుమూలలనుంచి అనేకమంది భక్తులు తరలివస్తూ ఉంటారు. ప్రతిఏటా మహాశివరాత్రి పర్వదినాల్లో నిర్వహించే రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఈనెల 6నుంచి 11 వరకూ జరగనున్నాయి. ఇక్కడి ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు మహారాష్ట్ర, ఒడిస్సా, బీహార్, తమిళనాడు, కర్నాటక, కేరళ, ఢిల్లీ, హర్యానా, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలనుంచి భక్తులు అధికంగా తరలివస్తారు. మహాశివరాత్రి పర్వదినంతోపాటు స్వామి, అమ్మవార్ల కల్యాణం, రథోత్సవం, తెప్పోత్సవం, శ్రీపుష్పోత్సవం రోజుల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. ఈ పర్వదినాల్లో 8లక్షల వరకూ భక్తులు వస్తారని అంచనా వేస్తున్న నేపథ్యంలో అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్షేత్రంలో స్వయంభువ కోడిరూపమున స్ఫటిక లింగాకారంలో వెలసి కుక్కుటేశ్వరుడిగా పూజలు అందుకొంటున్నారు. అప్పటినుంచి మహాశివరాత్రికి ఉత్సవాలు జరుగుతున్నాయి.

మహాశివరాత్రికి విస్తృత ఏర్పాట్లు

మహాశివరాత్రి సందర్భంగా జిల్లాలోని శైవక్షేత్రాల్లో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. పిఠాపురం పాదగయ క్షేత్రంలోని కుక్కుటేశ్వరస్వామి దేవస్థానం, సామర్లకోటలో కుమార భీమేశ్వరస్వామి ఆలయంతోపాటు ఇతర మండలాల్లోని శివాలయాల్లో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు జరగనున్నాయి. 8న మహాశివరాత్రి పర్వదినం కాగా, అంతకు ముందు నుంచే ఆయా ఆలయాల్లో ఉత్సవాలు జరుగుతాయి. కొన్ని ఆలయాల్లో ఇప్పటికే ఏడురోజులపాటు నిరంతరాయంగా జరిగే భజన కార్యక్రమాల సప్తాహ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయాలకు భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉండడంతో దేవదాయశాఖ అధికారులు అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు

-నారాయణమూర్తి, సహాయ కమిషనరు, ఈవో, పాదగయ

మహాశిరాత్రి ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో అన్నిశాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించాం. లక్షలాదిమంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పాదగయ పుష్కరిణి, ఆలయం లోపల ఇబ్బంది కలగకుండా క్యూలైన్లు పటిష్టంగా ఏర్పాటు చేస్తున్నాం. సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. గజఈతగాళ్లను అందుబాటులో ఉంచుతున్నాం.



పిఠాపురం పాదగయ క్షేత్రం

6న ఉత్సవాలకు అంకురార్పణ

పాదగయలో రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి కళ్యాణోత్సవాలు తొలిరోజు 6న ఉదయం స్వామి, అమ్మవార్లకు పంచామృతస్నానం, అంకురార్పణం, ధ్వజారోహణం, స్వామికి లక్ష బిల్వార్చన, రాజరాజేశ్వరీదేవికి లక్షకుంకుమార్చన, మధ్యాహ్నం స్వామి, అమ్మవార్లకు పెళ్లి అలంకారం, సాయంత్రం గజవాహనంపై గ్రామోత్సవం, రామకృష్ణ వాసవి కళ్యాణ మండపం వద్ద ఎదురు సన్నాహాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, రాత్రి 8.32 గంటలకు గంటలకు దివ్యకళ్యాణం నిర్వహిస్తారు.

7న కుంకుమార్చన

కుక్కుటేశ్వరస్వామికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, సహస్ర చామంతి పూజ, గ్రామోత్సవం జరుగుతాయి. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం గ్రామోత్సవం జరుగుతుంది.

8న మహాశివరాత్రి

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా తెల్లవారుజాము 2గంటలనుంచి కుక్కుటేశ్వరస్వామి నిజరూప దర్శనం, ఉదయం ఆరు గంటలకు స్వామికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, ఉదయం 10గంటలకు గ్రామోత్సవం, సాయంత్రం 5 గంటలకు సదస్యం పండిత సభ, ఆరుగంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు రాత్రి 8గంటల నుంచి పిఠాపురం మహారాజా గోత్రనామాలతో లింగోద్భవ కాలాభిషేకం, తర్వాత నందివాహనంపై స్వామి గ్రామోత్సవం జరుగుతాయి.

9న రథోత్సవం

ఉదయం స్వామికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, మధ్యాహ్నం 3గంటలకు నాకబలి-దండాడింపు, దొంగలదోపు ఉత్సవం, విచిత్ర వేషాలు, వివిధ రకాల మేళతాళాలతో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, రాత్రి కుంతీమాధవస్వామి ఆలయంనుంచి రథోత్సవం ప్రారంభించి ఉప్పాడ సెంటర్‌లో నిలుపుతారు.

10న త్రిశూలస్నానం

కుక్కుటేశ్వరస్వామికిఅభిషేకం, రాజరాజేశ్వరీదేవికి కుంకుమార్చన ఉదయం 10గంటలకు త్రిశూలస్నానం జరుగుతాయి. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

11న తెప్పోత్సవం, శ్రీపుష్పయాగం

ఉదయం స్వామికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, రాత్రి 7గంటలకు స్వామి,అమ్మవార్లకు హంస వాహనంపై తెప్పోత్సవం, 8గంటలకు పుష్పోత్సవం, ఏకాంతసేవాగానం జరుగుతాయి. స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక అలంకారం చేస్తారు.

98.06శాతం చిన్నారులకు పోలియో వ్యాక్సినేషన్ పూర్తి

- డీఎంహెచ్‌వో నరసింహనాయక్



పోలియో చుక్కలు వేస్తున్న కమిషనర్, డీఎంహెచ్‌వో

జీజీహెచ్(కాకినాడ)/కార్పొరేషన్(కాకినాడ), మార్చి 3:జిల్లావ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతమైంది. మొత్తంగా 98.06శాతం చిన్నారులకు వ్యాక్సినేషన్ కార్యక్రమం పూర్తయింది. కాకినాడ గాంధీనగర్‌లోని ప్రతాప్‌నగర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని కమిషనర్ జె.వెంకటరావు, జిల్లావైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నరసింహనాయక్ సంయుక్తంగా ఆదివారం ప్రారంభించారు. ఐదేళ్లలోపు 1,94,332మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు 1375 బూత్‌లను ఏర్పాటు చేశారు. పోలియోరహిత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కమిషనర్ జె.వెంకటరావు సూచించారు. కాకినాడలో 170 కేంద్రాల్లో పోలియో చుక్కలను వేయిస్తున్నామన్నారు. మరో 20 బృందాలు రైల్వేస్టేషన్లు, బస్టాండ్ వంటి జనసాంద్రత అధికంగా ఉండే ప్రాంతాల్లో పోలియో చుక్కలు వేస్తున్నాయన్నారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి నరసింహ నాయక్ మాట్లాడుతూ ఈనెల 4, 5 తేదీల్లో ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి మిగిలిన వారికి పోలియోచుక్కలు వేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రత్నకుమార్, ఎస్ఓ విజయలక్ష్మి, డెమో ప్రసాద్‌రాజు, డాక్టర్ సురేఖచౌదరి, డాక్టర్ అజీబ్ పాల్గొన్నారు.

భారీ వాహనాల భయం

- అతివేగంతో దూసుకెళ్తున్న గ్రానైట్ లారీలు
- తుని పరిసర గ్రామాల్లో గ్రామీణ ప్రాంతాల మీదుగా జాగ్రత్తలు తీసుకోకుండానే ప్రయాణం
- తరచూ ప్రమాదాలతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న గ్రామస్తులు
- తేటగుంటలో వాహనాలను అడ్డుకుని బైఠాయించిన స్థానిక యువకులు



తుని మండలం తేటగుంటలో నిలిచిపోయిన లారీలు

తుని రూరల్, మార్చి 3: గ్రానైట్ వనరులు పుష్కలంగా ఉన్న రౌతులపూడి మండల గ్రామాలనుంచి అధికార పార్టీకి చెందిన ఓ నేత భారీ వాహనాలు తుని మండలం తేటగుంటలో పరిసర ప్రాంతాల్లో గ్రామీణ రహదారులపై సామర్థ్యానికి మించి బరువులతో దూసుకువెళ్తున్నాయి. పోలీసులు, రవాణాశాఖాధికారులు ఈ భారీ వాహనాల జోలికి వెళ్లకపోవడం అనుమానాలు తావిస్తోంది. రౌతులపూడి ఎగువ ప్రాంతాలనుంచి నిత్యం వందలాదిగా లారీలు గ్రానైట్, మెటల్ లోడులను నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్నారు. రౌతులపూడి, తుని, తొండంగి గ్రామాల మీదుగా కాకినాడ సెజ్ పోర్టు ప్రాంతాలకు అనుసంధానంగా ఉన్న ఈ గ్రామీణ రోడ్ల సామర్థ్యం 8టన్నులు అయితే 45టన్నుల పైబడి గ్రానైట్ లోడులతో సామర్థ్యానికి మించి రవాణా చేయడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ వాహనాలు అదనపు బరువులతో దూసుకురావడంతో రోడ్లు ధ్వంసమవుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. రోడ్లను ఆనుకుని ఉన్న పాఠశాలలకు పిల్లలను పంపించాలంటే భయభ్రాంతులకు గురవుతున్నామని తెలుపుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని బిక్కుబిక్కుమంటున్నారు. ఈ భారీవాహనాల్లో అనుభవం లేని డ్రైవర్లు, షైనర్లే ఎక్కువగా పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల విద్యుత్ స్తంభాలు ఢీకొట్టి ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ ఓ షైనర్‌గా వెలుగుచూసింది. వాహనాల వేగానికి భారీబండరాళ్లు కిందపడి రోడ్లు ధ్వంసమవడంతోపాటు ప్రమాదాలకు కారణమవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వాహనాల వెనుక వెళ్తున్న వాహనచోదకులు ప్రాణాలు అరచేతిల్లో పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ వాహనాల తీరుతో ప్రజలు, ప్రజాసంఘాల నుంచి తీవ్ర వ్యతిరేక ఎదురవడంతోపాటు పలుమార్లు ఆందోళనలు చేపట్టిన సంఘటనలున్నాయి. ఈ లారీల నిర్వాహకులకు ప్రభుత్వ పెద్దల అండదండలు ఉండడంతో వాహనాలకు అడ్డూఅదుపూ లేకుండాపోయింది. తునిరూరల్, తేటగుంటవద్ద శనివారం రాత్రి యువకులు పెద్దసంఖ్యలో రోడ్డుపై బైఠాయించారు. ఇరువైపులా రాకపోకలు బంద్ అవడంతో పెద్దఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ వాహనాల రాకపోకలతో గ్రామాల్లో రోడ్లను ఆనుకుని నివాసాలు భయభ్రాంతులకు గురవుతున్నామని, వీటి కట్టడికి చర్యలు తీసుకోవాలని పలుమార్లు కోరినా పెడ చెవిన పెడుతున్నారని ఆందోళన చేపట్టారు. దీంతో ఓ వైసీపీ నేత రంగంలోకి దిగి పరిస్థితి చక్కదిద్దడంతో వివాదం సద్దుమణిగింది.

తలుపులమ్మ లోవలో భక్తుల కోలాహలం

తుని రూరల్, మార్చి 3: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లోవదేవస్థానానికి అమ్మవారి దర్శనార్థం ఆదివారం వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. వేకువజామున భక్తజనంతో ఆలయ ప్రాంగణంతోపాటు క్యూలైన్‌లు కిక్కిరిశాయి. ఆలయ ప్రాంగణంలో దేవస్థానం ఆధ్వర్యంలో నడుస్తున్న వసతిగదుల్లో కుటుంబసమేతంగా లోవకు తరలివచ్చిన భక్తులు వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. ఘాట్ రోడ్డుతోపాటు ఆలయ పరిసరాల్లో రూరల్ పోలీసులు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆదివారం ఒక్కరోజే భక్తులనుంచి ఆలయానికి వివిధ విభాగాల ద్వారా రూ.2,47,949 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో విశ్వనాథరాజు తెలిపారు.

నేడు జిల్లాస్థాయి 'స్పందన'

కాకినాడ సిటీ, మార్చి 3: జగనన్నకు చెబుదాం.. జిల్లాస్థాయి స్పందన ఈనెల 4వతేదీ సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి కాకినాడ కలెక్టరేట్ స్పందన హాల్‌లో జరుగుతుందని కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. ఈ విషయాన్ని అర్జీదారులు, జిల్లా అధికారులు గమనించాలని ఆమె ఒక ప్రకటనలో సూచించారు.

వైభవంగా మాఘమాస తిరునాళ్లు -6లో



సర్పవరంలో భావనారాయణస్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



విద్యార్థికి గ్రాడ్యుయేషన్ పట్టా అందజేస్తున్న డీఎంఈ డాక్టర్ నరసింహం

నైపుణ్యత మెరుగుదలతో నిష్ణాతులు కావచ్చు

- ఆర్ఎంసీ గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో డీఎంఈ నరసింహం

జీజీహెచ్(కాకినాడ), మార్చి 3: వైద్యశాస్త్రంలో నైపుణ్యతను మెరుగుపర్చుకోవడం ద్వారా నిష్ణాతులైన వైద్యనిపుణులుగా ఖ్యాతి గడించవచ్చని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం అన్నారు. కాకినాడ రంగరాయ వైద్యకళాశాల ఆడిటోరియంలో 2018- 2024 విద్యార్థి సంవత్సరానికి సంబంధించిన వైద్య విద్యార్థుల 61వ గ్రాడ్యుయేషన్ వేడుకలను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. దీనికి డీఎంఈ డాక్టర్ నరసింహం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో వైద్యరంగానికి ఉన్న గుర్తింపు మరే రంగానికి లేదని, నేర్చుకున్న వైద్య విద్యను నిరుపేదలకు అందేలా సేవాభావంతో వైద్యచికిత్స సేవలందించాలని తద్వారా చదువుకు, మానవత్వానికి సార్థకత చేకూరుతుందన్నారు. వైద్యవిద్యార్థులను గ్రాడ్యుయేషన్ పట్టా పొందిన రోజు విద్యార్థి జీవితంలో మరువలేని మధురానుభూతి ఏర్పడుతుందన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో నైపుణ్యత పెంపొందించుకుంటూ నేర్చుకున్న వైద్య విద్యను గ్రామీణ, లోతట్టు ప్రాంతాలలోను పేదలకు వైద్యసేవలు అందిస్తే వైద్య శాస్త్రానికి వన్నె తేవచ్చన్నారు. ప్రస్తుతం గ్రాడ్యుయేషన్ పట్టా పొందిన విద్యార్థులు భవిష్యత్తులో పోస్టు గ్రాడ్యుయేషన్, సూపర్ స్పెషాలిటీ కోర్సుల్లో రాణించి కళాశాల పేరును నలుదిక్కులా వ్యాపింపచేయాలని ఆకాంక్షించారు. ఈ గ్రాడ్యుయేషన్ డేలో భాగంగా 2018-2024 బ్యాచ్‌కు చెందిన 201మంది విద్యార్థులకు వైద్యపట్టాలను అందజేసినట్లు డాక్టర్ నరసింహం తెలిపారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరిండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఎ.విష్ణువర్థన్, డాక్టర్ దేవిమాధవి, ఫోరెన్సిక్ హెచ్‌వోడీ డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ వరప్రసాద్ పాల్గొన్నారు.

సామర్లకోట భీమేశ్వరాలయంలో.. 6 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం

సామర్లకోట, మార్చి 3: సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో ఈ నెల 6 నుంచి 11 వరకూ మహాశివరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ల నీలకంఠం వెల్లడించారు. ఆదివారం ఈ మేరకు విలేకరులతో ఆయన మాట్లాడారు.

ఐదురోజులపాటు కార్యక్రమాలు

- 6న బుధవారం ఉదయం గణపతిపూజ, అంకురార్పణ, దీక్షాదారణ నిర్వహిస్తామని, మధ్యాహ్నం 2.15 గంటలకు స్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఇత్తడి నంది వాహనంపై అలంకరించి పురవీధుల మీదుగా గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. రాత్రి 8.15 గంటలకు ధ్వజారోహణం, అనంతరం ప్రత్యేక వేదికపై స్వామి, అమ్మవార్ల దివ్య కల్యాణమహోత్సవం వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల మధ్య జరపనున్నట్లు తెలిపారు.
- 7న గురువారం ఉదయం స్వామివారికి అభిషేకం, అమ్మవారికి విశేష కుంకుమార్చన పూజలు, స్వామివారికి నీరాజనమంత్రపుష్పాలు నిర్వహిస్తామన్నారు.
- 8న శుక్రవారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా తెల్లవారుజామున ఒంటిగంట నుంచి స్వామివారి మూల విరాట్‌లో మాత్రమే అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం పండిత సదస్యం, రాత్రి 10 గంటల నుంచి 12.15 గంటల వరకూ మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, లింగోద్భవకాల పూజలు పిఠాపురం మహారాజా వారి గోత్ర నామాలతో నిర్వహిస్తామన్నారు. రాత్రి 12.30 గంటలకు మహానివేదన నిర్వహిస్తామన్నారు.
- 9న శనివారం ఉదయం 8 గంటలకు స్వామివారికి అభిషేకం, అమ్మవారికి విశేష కుంకుమార్చన పూజలు, మధ్యాహ్నం 3.20 గంటలకు ధూపసేవ తర్వాత రథోత్సవం గాంధీబొమ్మ సెంటర్‌నుంచి ప్రారంభమవుతుందన్నారు.
- 10న ఉదయం 8.05గంటలకు త్రిశూలస్నానం, 11.05 గంటలకు తీర్థపుసేవ నిర్వహిస్తామన్నారు.
- 11న సోమవారం రాత్రి 7.45 గంటలకు స్వామివారికి, అమ్మవారికి శ్రీపుష్పయాగోత్సవం నిర్వహిస్తామన్నారు.

సాంస్కృతిక ఉత్సవాలు

మహాశివరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని ఐదురోజులపాటు వివిధ రంగాల్లో నిష్ణాతులైన కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని ఈవో తెలిపారు.

- 6న సాయంత్రం నృత్యంజలి కళానిలయం సామర్లకోట బాలబాలికలతో కూచిపూడి భరతనాట్యం ప్రదర్శన.
- 7న సాయంత్రం అమృతవర్షిణి భక్తబృందం ఆధ్వర్యంలో గాత్రకచేరి.
- 8న సాయంత్రం బాలాత్రిపురసుందరి నృత్యనికేతన్ కాకినాడ వారి ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యప్రదర్శన.
- 9న సాయంత్రం సామర్లకోట సంగీత కళాకారుల ఆధ్వ ర్యంలో అన్నమయ్య, త్యాగయ్య కీర్తనలు
- 10న సాయంత్రం సామర్లకోట కన్యకాపరమేశ్వరి భజన మండలి వారి ఆధ్వర్యంలో భజనలు నిర్వహిస్తారు.

ఈ కార్యక్రమంలో ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, చెరుకూరి సుందరరామయ్యశర్మ, కొంతేటి భీమేశ్వరశర్మ, సన్నిధిరాజు వెంకన్నబాబు, సూపరింటెండెంట్ ఏవీవీబీ. ఈశ్వరరావు, పి.గుర్రాజు, జి.ఇందు, బీ.వీరబాబు, పీహెచ్.వీరబాబు, శృతిలు పాల్గొన్నారు.

కెమెరాల కోసం యువకుడి హత్య

- విశాఖలో అదృశ్యమై.. జొన్నాడలో శవమయ్యాడు
- బక్కన్నపాలెం ఫొటోగ్రాఫర్ సాయి మృతదేహం లభ్యం
- గోదావరి ఇసుక తిన్నెల్లో వెలికితీత
- నిందితుడు మూలస్థానం వాసి



హత్యకు గురైన పోతిన సాయి (పాత చిత్రం)



ఆలమూరు: జొన్నాడ సమీపాన గోదావరిలో పాతిపెట్టిన మృతదేహాన్ని వెలికితీసిన దృశ్యం

కొమ్మాది/ఆలమూరు, మార్చి 3 : మధురవాడలోని బక్కన్నపాలెంకు చెందిన ఫొటోగ్రాఫర్ సాయి పవన్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం వద్ద హత్యకు గురవ్వడం స్థానికంగా సంచలనం రేపింది. పీఎం పాలెం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. బక్కన్నపాలెం గ్రామానికి చెందిన పోతిన సాయి పవన్ ఆన్‌లైన్ బిజినెస్ ద్వారా ఫొటో షూట్‌లు చేస్తుంటాడు. తండ్రి శ్రీను ఆటోడ్రైవర్ కాగా తల్లి రమణమ్మ కార్‌షెడ్ జంక్షన్‌లో ఫ్యాన్సీషాపు నిర్వహిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు కాగా పెద్దవాడు సాయి పవన్ (22) ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా ఫొటోషూట్ చేస్తుంటాడు. ఈ విషయం తెలుసుకున్న కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మూలస్థానం అగ్రహారానికి చెందిన షణ్ముఖ తేజ తాను కూడా ఫొటో షూట్ చేస్తుంటానని, ఫోన్ ద్వారా సాయిని పరిచయం చేసుకున్నాడు. షణ్ముఖ తేజ, సాయి వద్ద రూ. 15 లక్షల విలువైన హైటెక్నాలజీ కెమెరాలు ఉన్నట్టు తెలుసుకున్నాడు.వాటిని ఎలాగైనా దక్కించుకోవాలన్న ఉద్దేశంతో సాయికి ఫోన్ చేసి రావులపాలెంలో పెద్ద ఈవెంట్ ఉందని, నీ దగ్గర ఉన్న కెమెరాలతో ఇద్దరం కలిసి ఈవెంట్ చేస్తే మంచి డబ్బులు వస్తాయని నమ్మ బలికాడు. దీంతో సాయి గతనెల 26న విశాఖ నుంచి రైలులో బయల్దేరి రాజమహేంద్రవరం చేరుకున్నాడు. అక్కడి నుంచి షణ్ముఖ తేజ కారును అద్దెకు తీసుకొచ్చి కడియం మండలం పొట్టిలంకకు చెందిన కారు డ్రైవర్ వినోద్‌తో కలిసి దారిమధ్యలో సాయి పీకను తాడుతో బిగించి హత్య చేసి జొన్నాడ వద్ద గోదావరి ఇసుక తిన్నెల్లో పాతి పెట్టారు. రూ.15 లక్షల విలువ చేసే కెమెరాలు, ఇతర సామగ్రిని పట్టుకుని పారిపోయారు. అయితే ముందుగా తనకు ఏదో ఆపద జరుగుతుందని గమనించిన సాయి కారు నెంబరును తన తల్లికి వాట్సాప్ చేశారు. తన నెంబరు పని చేయకపోతే వేరే నెంబరుకు ఫోన్ చేయమని తేజ నెంబరు పంపించాడు. తన కుమారుడు ఆపదలో ఉన్నాడనే విషయాన్ని తల్లి తెలుసుకోలేక పోయింది. ప్రతిరోజూ మాట్లాడేవాడు రెండు రోజులుగా ఫోను చేయలేదని అనుమానం వచ్చి వారి వద్ద ఉన్న సమాచారంతో గతనెల 29న పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదృశ్య కేసుగా నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సాయి పంపించిన కారు నంబరు, ఫోన్ నంబరు ఆధారంగా నిందితుడు మూలస్థానానికి చెందిన షణ్ముఖ తేజగా గుర్తించారు. సాయి కుంటుబ సభ్యులు పీఎం పాలెం సీఐ రామకృష్ణ సూచన మేరకు నిందితుడి ఇంటికి వెళ్లగా అప్పటికే షణ్ముఖతేజ పరారీలో ఉన్నాడు. అతని తల్లిదండ్రుల ను పోలీసులు విచారించగా సాయిని హత్య చేసి, కెమెరాలను పైనగదిలో పెట్టినట్టు చెప్పడంతో పోలీసు లు గది తాళాలు పగలకొట్టి కెమెరాలను స్వాధీనం చేసుకున్నారు. కెమెరాలను షణ్ముఖ తండ్రిని పీఎంపాలెం స్టేషన్‌కు తీసుకెళ్లారు.



నిందితుడు షణ్ముఖ తేజ

అమ్మాయితో చాటింగ్ చేయించి పట్టుకున్నారు..

నిందితుడు షణ్ముఖ తేజ మొదటి నంబరు స్విచ్ఛాఫ్‌లో ఉండగా రెండో నెంబరును పోలీసు లు ట్రేస్ చేసి అన్నవరంలో ఉన్నట్టు గుర్తించా రు. అక్కడికి వెళ్లేసరికి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి తప్పించుకున్నాడు. ఈ క్రమంలో పోలీసులు శనివారం షణ్ముఖ తేజకు నగరంలోని కంచరపాలెంకు చెందిన అమ్మాయికి ఫేస్‌బుక్ ద్వారా పరిచయం ఉన్నట్టు గుర్తించి ఆ అమ్మాయిని, ఆమె తల్లిని పీఎం పాలెం స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించారు. ఆమెతో షణ్ముఖకు ఫోన్‌లో చాటింగ్ చేయించారు. ఈమె మెసేజ్‌కు షణ్ముఖ స్పందించడంతో పోలీసులు అతన్ని పట్టుకున్నారు. విచారణ అనంతరం షణ్ముఖ ఇచ్చిన సమాచారం మేరకు సాయిని చంపి పూడ్చిపెట్టిన ప్రదేశాన్ని పోలీ సులు గుర్తించారు. అనంతరం పవన్ తల్లిదండ్రులకు సమాచారం అందించారు. అయితే ఈ కేసులో కేవ లం కెమెరాల కోసమే షణ్ముఖ ఇంతకు తెగించాడా లేదా మరో కోణం ఏమైనా ఉందా అన్న అనుమానాలు వ్యక్తం కావడంతో పోలీసులు ఆ దిశగా కూడా దర్యాప్తు చేస్తున్నారు.

బాధిత కుటుంబీకుల రోదన

వారం రోజుల క్రితం అదృశ్యమైన కుమారుడు సాయి మృతదేహం చూసి తల్లిదండ్రులు శ్రీను, రమణమ్మ బోరున విలపించారు. తమతో ఎంతో సరదాగా ఉండే సాయిని దారుణంగా చంపేశారంటూ స్నేహితులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుడిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

గౌతమి ఎక్స్‌ప్రెస్ రైలుకు ఎల్‌హెచ్‌బీ బోగీలు



గౌతమి ఎక్స్‌ప్రెస్ రైలు ఎల్‌హెచ్‌బీ బోగీలు

సామర్లకోట, మార్చి 3: రైలు ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలందించేందుకు అధునాతనమైన లింకె హాఫ్‌మన్ బచ్ బోగీలను కాకినాడ-లింగంపల్లి-కాకినాడల మధ్య రాకపోకలు సాగించే గౌతమి ఎక్స్‌ప్రెస్ రైలును ఏర్పాటుచేశారు. ఈ రైలు ఆదివారం నుంచి ప్రారంభించారు. కాకినాడ, సామర్లకోట రైల్వేస్టేషన్లకు ఈ మేరకు రైల్వే పీఆర్వో కార్యాలయం నుంచి ఆదేశాలు ఆదివారం అందాయి. ఆంధ్రజ్యోతి ఆ వివరాలను సేకరించింది. ఈ అధునాతన బోగీలను ప్రాథమికంగా కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు గత ఏడాది జూలై నెలలో ప్రారంభించారు. ఈ బోగీలు సత్ఫలితాలను ఇవ్వడంతో మరికొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కూడా ఎల్‌హెచ్‌బీ బోగీలను మార్పులు చేయడం కొనసాగించారు. అందులో భాగంగా కాకినాడ-లింగంపల్లి-కాకినాడల మధ్య రాకపోకలు సాగిస్తున్న గౌతమి ఎక్స్‌ప్రెస్ రైలుకు కూడా ఎల్‌హెచ్‌బీ బోగీలను అనుసంధానం చేశారు. ఈఅధునాతన బోగీలను జర్మనీ కొలాబ్రేషన్‌తో కపూర్తలాలో తయారుచేస్తున్నారు. ఈఅధునాతన ఎల్‌హెచ్‌బీ బోగీ లతో ప్రయాణం ఎటువంటి కుదుపులు, సౌండ్స్ లేకుండా సాఫీగా సాగుతుంది. డబుల్ సస్పెన్షన్, డిస్క్, బ్రేకింగ్ విధానంతోనూ ఈ బోగీలలో ప్రయాణం మరింత ఉల్లాసాన్ని ఇస్తుందని రైల్వే అధికారి తెలిపారు. మొత్తం 24 బోగీలలో 22 బోగీలు ఎల్‌హెచ్‌బీ బోగీలే కావడం విశేషం.

9, 10న అఖిల భారత తెలుగు సాహితీ సదస్సు



సదస్సు ఆహ్వానపత్రికలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 3: మూడు దశాబ్దాలుగా అమెరికాలో అనేక సాహిత్య కార్యక్రమాలను నిర్వహిస్తున్న వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా 30వ వార్షికోత్సవం సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో రెండురోజులపాటు ఈనెల 9, 10వ తేదీల్లో అఖిల భారత తెలుగు సదస్సు జరగనుంది. కాకినాడ దంటు కళాక్షేత్రంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగూరి చిట్టెన్‌రాజు సదస్సు ఆహ్వానపత్రికను ఆదివారం ఆవిష్కరించారు. చిట్టెన్‌రాజు మాట్లాడుతూ సాహిత్యాన్ని ప్రజలకు చేరువ చేయాలనే ఉద్దేశంతో మొట్టమొదటిసారిగా కాకినాడలో అఖిల భారత తెలుగు సాహితీ సదస్సు జరుపుతున్నట్లు తెలిపారు. భారత 13వ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు ముఖ్యఅతిథిగా హాజరవుతారని పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, మండలి బుద్ధప్రసాద్ అతిథులుగా హాజరవుతారన్నారు. కార్యక్రమంలో మార్ని జానకిరామచౌదరి, కొరుప్రోలు గౌరినాయుడు, డాక్టర్ జోస్యుల కృష్ణబాబు, వైఎస్ఎన్ మూర్తి, డాక్టర్ శైలజ, సుచిత్రామూర్తి, ప్రకాష్, చింతపల్లి సుబ్బారావు, సాయిసత్యనారాయణ, ప్రభుదాస్, కృష్ణారావు పాల్గొన్నారు.

చిన్నారిపై వేధింపులకు పాల్పడుతున్న

అధికార పార్టీకి చెందిన ఎంపీపీ కారు డ్రైవర్

- న్యాయంకోసం రోడ్డెక్కిన బాలిక కుటుంబసభ్యులు
- ఎంపీపీపై దాడికి యత్నించిన మహిళలు
- పరారీలో డ్రైవర్
- కేశవరంలో ఘటన
- పోలీసులు ఇరుపక్షాలకు నచ్చచెప్పి శాంతింప చేశారు



కేశవరంలో చిన్నారిపై ఎంపీపీ డ్రైవర్ వేధింపులను నిరసిస్తూ బాధితుడిని శిక్షించాలని కోరుతూ ఆందోళనకు దిగిన చిన్నారి బంధువులు



ఎంపీపీ వాసుపై కేశవరంలో దాడికి పాల్పడుతున్న దృశ్యం

మండపేట, మార్చి 3: నాల్గవ తరగతి చదువుతున్న చిన్నారిపై వేధింపులకు పాల్పడుతున్న వ్యక్తిపై ఎంపీపీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవటంతో న్యాయం కోసం రోడ్డెక్కిన బాలిక కుటుంబ సభ్యులతో కేశవరంలో ఆదివారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. న్యాయం చేస్తామని చెప్పిన ఎంపీపీ వాసు తన వద్ద పనిచేసే కారు డ్రైవర్ బాలికను వేధిస్తుండటంతో న్యాయం చేయటంలో జాప్యం చేసి డ్రైవర్‌కు వంతపాడటంతో ఆగ్రహించిన బాలిక తల్లిదండ్రులు ఆదివారం సాయంత్రం కేశవరంలో న్యాయం కోసం రోడ్డెక్కారు. గ్రామానికి చెందిన చిన్నారి స్థానిక పాఠశాలలో 4వ తరగతి చదువుతోంది. చిన్నారిని ఎంపీపీ డ్రైవర్ పాఠశాలకు వెళ్లే సమయంలో, వచ్చేటప్పుడు వెంటపడి వేధించటం చేసేవాడు. ఈ విషయాన్ని చిన్నారి తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో తల్లిదండ్రులు నిఘా పెట్టారు. వెంటపడుతున్నట్టు తల్లిదండ్రులకు చెబితే చిన్నారిని హతమారుస్తానని బెదిరింపులకు పాల్పడినట్టు కూడా చిన్నారి చెప్పింది. తమ బిడ్డపై గ్రామానికి చెందిన ఎంపీపీ డ్రైవర్ కూసు ప్రసాద్ వేధింపులకు పాల్పడుతున్నాడని సీసీ ఫుటేజ్‌లు ఆధారంగా నిర్ధారించుకున్నారు. జరిగిన సంఘటనపై ఎంపీపీకి న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. ఎంపీపీ కాలయాపన చేసి న్యాయం చేయకపోగా డ్రైవర్‌కి అండగా నిలవటంతో చిన్నారి తల్లిదండ్రులు న్యాయం చేయాలని కోరుతూ ఆదివారం సాయంత్రం కేశవరం - రాజమహేంద్రవరం వెళ్లే రోడ్డులో ఆందోళనకు దిగారు. ఒక దశలో బాలిక కుటుంబసభ్యులు ఎంపీపీ వాసుపై దాడికి ప్రయత్నించగా స్థానికులు అతడిని వేరేచోటకు తరలించారు. ఇరువర్గాల మధ్య చోటుచేసుకున్న ఉద్రిక్తత పరిస్థితులు నడుమ కేశవరం రాజహేంద్రవరం రోడ్డులో ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. కేశవరంలో జరిగిన సంఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు చెప్పటంతో చిన్నారి తల్లిదండ్రులు ఎంపీపీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండపేట రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలవారిని చెదర గొట్టారు. ఎంపీపీని ఘటనా ప్రాంతం నుంచి సురక్షిత ప్రాంతానికి పోలీసులు తరలించారు. ఈ సంఘటనపై చోటుచేసుకున్న పరిణామాలపై పోలీసులు ఇరుపక్షాలకు నచ్చచెప్పి గొడవను సర్దుమణి గేలా చేశారు. ఎంపీపీ డ్రైవర్ జరిగిన సంఘటనపై చిన్నారి కుటుంబ సభ్యులకు క్షమాపణ చెప్పటంతో ఆందోళన విరమించారు. మండపేట రూరల్ ఎస్ఐ చైతన్యకుమార్ తన సిబ్బందితో పరిస్థితిని అదుపు చేసి ట్రాఫిక్‌ను నియంత్రించారు.

ఘనంగా విశ్వేశ్వరస్వామి కల్యాణం



శ్రీ విశ్వేశ్వర గిరి పీఠాధిపతి శ్రీ ఆత్మానంద భారతి స్వామి వారితో జ్యోతుల నెహ్రూ

జగ్గంపేటరూరల్, మార్చి 3: కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం ఇర్రిపాకలో జరుగుతున్న కోటి పార్థివలింగ మహారుద్రాభిషేకంలో భాగంగా ఆదివారం 7వ రోజు విఘ్నేశ్వర పూజ, పరిషత్ పంచగవ్య ప్రాసన, గోపూజ, మహాన్యాసము, రుద్రాభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చన, అరుణ హోమం, వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జ్యోతుల నెహ్రూ మణి, జ్యోతుల నవీన్ లక్ష్మీదేవి, తోట సర్వారాయులు సునీత దంపతులు పీటలపై కూర్చుని విశ్వేశ్వర స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీ విశ్వేశ్వర గిరి పీఠాధిపతి, విశ్వ ధర్మపరిరక్షణ వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ ఆత్మానంద భారతి స్వామీజీ హాజరై మహారుద్రాభిషేకంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆత్మానంద భారతి స్వామీజీ మాట్లాడుతూ కోటి పార్థివ లింగా మహా రుద్రాభిషేకం జ్యోతుల నెహ్రూ పూర్వజన్మ సుకృతం వల్లే ఇంతటి కార్యక్రమాన్ని చేస్తున్నార న్నారు. ప్రతిఒక్కరు శివనామ స్మరణ, విష్ణు నామస్మరణ తో సనాతన ధర్మాన్ని పాటించాలని స్వామిజీ కోరారు.

నా బాల్యం గుర్తొచ్చింది..

- షిర్డీసాయి క్రీడోత్సవ్‌లో నటుడు సాయికుమార్



క్రీడోత్సవ్ కార్యక్రమంలో పాల్గొన్న నటుడు సాయికుమార్, భారతషూటర్ ఈషాసింగ్, నౌకాదళ కమేండర్ స్వాతి

రాజమహేంద్రవరం రూరల్/దివాన్‌చెరువు, మార్చి 3: రాజమహేంద్రవరం షిర్డిసాయి విద్యాసంస్థల ఆధ్వర్యంలో క్రీడోత్సవ్ పేరుతో నిర్వహించిన వార్షిక క్రీడా, సాంస్కృతిక కార్యక్రమం దివాన్‌చెరువు షిర్డిసాయి విద్యాప్రాంగణంలో ఘనంగా జరిగింది. దీనికి భారత షూటర్ ఈషాసింగ్, నౌకాదళ లెఫ్టినెంట్ కమాండర్ పి.స్వాతి, నటుడు సాయికుమార్ ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. షిర్డిసాయి విద్యానికేతన్ వ్యవస్థాపకుడు తంబాబత్తుల పాలేశ్వరరావు సతీమణి నాగమణి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈషాసింగ్ మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణించాలంటే కృషి, పట్టుదల అవసరమన్నారు. సాయికుమార్ మాట్లాడుతూ మార్చ్‌పాస్ట్ డ్రిల్ చూస్తున్నపుడు తన బాల్యం గుర్తుకు వచ్చిందని, తాను కూడా ఎన్‌సీసీ విద్యార్థినే అన్నారు. స్వాతి మాట్లాడుతూ పిల్లల అభివృద్ధిలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపాత్ర కీలకమన్నారు. తన స్వీయ అనుభవాలను వివరించారు. విద్యార్థుల ప్రదర్శనలు, సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో షిర్డిసాయి విద్యాసంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్, డైరెక్టర్ టి.శ్రీవిద్య, టి.శ్రీలేఖ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైభవంగా మాఘమాస తిరునాళ్లు

- ఆలయానికి పోటెత్తిన వేలాది భక్తులు



విశేషాలంకరణలో దర్శనమిచ్చిన శ్రీ రాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి

సర్పవరం జంక్షన్, మార్చి 3: దేశంలో ఉన్న 108 వైష్ణవ దేవాలయాల్లో ఒకటిగా ఖ్యాతి గడించిన సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం సర్పవరంలో శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావనారాయణస్వామి ఆలయంలో మాఘమాస మహోత్సవాలు గత నాలుగు ఆదివారాలుగా అత్యంత వైభవంగా సాగుతున్నాయి. శ్రీభావనారాయణస్వామిని దర్శించుకునేందుకు ఉమ్మడి జిల్లా నుంచే కాక రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు తరలిరావడంతో ఆలయానికి భక్తులు పోటెత్తారు. ముందుగా స్వామివారికి పూజారులు సుప్రభాత సేవ నిర్వహించిన అనంతరం భక్తులకు స్వామిని దర్శించుకునేందుకు అనుమతించారు. భావనారాయణస్వామిని దర్శించుకున్న అనంతరం ఈశాన్యభాగాన ఉన్న లక్ష్మీదేవి, ఆగ్నేయం లోని ఆదిశేష శ్రీభావనారాయణస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం స్వామివారికి ప్రీతిపాత్రమైన పాల పొంగులను ఆవుపిడకల పొయ్యిపై పరమాణ్ణం తయారుచేసి భక్తశ్రద్ధలతో స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. మాఘమాసంలో భావనారాయణస్వామిని దర్శించుకుంటే దేశంలో ఉన్న 108 వైష్ణవ దేవాలయాల్లో ఉన్న శైవక్షేత్రాలను దర్శించుకున్న ఫలితం దక్కుతుందని భక్తులు తెలిపారు. సుమారు 35 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ చైర్మన్ పుల్ల నారాయణరావు, ఈవో జె భీమశంకరరావు తెలిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్, ఉప సర్పంచ్‌లు శీలం నాగేశ్వరరావు, పుల ప్రభాకరరావు, పుల్లచందూ, పుల్ల చక్రధర్, పి.వీరవెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

డొంకరాయి పవర్ కెనాల్ మరమ్మతులు 80 శాతం పూర్తి



పనులు నిర్వహిస్తున్న కార్మికులు

మోతుగూడెం, ఫిబ్రవరి 3: చింతూరు మండలం మోతుగూ డెం డొంకరాయి మరమ్మతులు 80శాతం పూర్తయ్యాయని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా విలేఖరులతో మాట్లాడుతూ పవర్ కెనాల్ రెండు రీచ్‌ల్లో కూడా పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. మరో ఒక రోజులో మిగతా 20 శాతం పనులు కూడా పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. గ్రిడ్ అధికారులు ఈనెల 5వ తేదీ వరకే ఎల్‌సీ అనుమతులు మంజూరు చేశారని, అయితే ఈనెల 4వ తేదీన పూర్తి చేయించాలని సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ బొడ్డు శ్రీధర్ ఆదేశించడంతో కాంప్లెక్స్ పరిధిలోని ఇంజనీర్స్ సిబ్బంది దగ్గరుండి పనులు పర్యవేక్షిస్తూ పనుల్లో నాణ్యత లోపాలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. గత రెండు రోజులు నుంచి ప్లాస్టింగ్ కాంక్రీట్ పనులు సుమారు 20 మంది కాంట్రాక్టర్లు 400 మంది కార్మికులు చేస్తున్నారు. ఆదివారం కానీ, సోమవారం కానీ ఉభయగోదావరిజిల్లాల రబీ సీజన్ నీళ్ల వదులుతున్న నేపథ్యంలో ఏపీ జెన్కో అధికారులు పనులు వేగంగా చేస్తున్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.వెంకటేశ్వరరావు, ప్లాంట్ మేనేజర్ భీమవరం బాలకృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్, ఇంజనీర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం



సీతారాములవారికి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

వరరామచంద్రపురం, మార్చి 3: రెండో భద్రాద్రిగా పేరుగాంచిన శ్రీరామగిరిలో సీతారాములవారి కల్యాణం ఆదివారం ఘనంగా జరిగింది. భద్రాచలం దేవాలయం వారి ఆధ్వర్యంలో హిందూ ప్రచారంలో భాగంగా శ్రీరామగిరిలో రామాలయ ప్రచార వాహనంలో ఈ కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. అక్షింతలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి స్థానిక శ్రీరామగిరి ప్రధానార్చకుడు సౌమిత్రి పురుషోత్తమాచార్యులు, ఈవో గన్ని లక్ష్మీకుమారి, మేనేజర్ సాయిబాబు పాల్గొన్నారు.

వైభవంగా సత్తెమ్మతల్లి తీర్థం



ముమ్మిడివరం, మార్చి 3: ప్రజల ఆరాధ్య దేవత, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లి శ్రీసత్తెమ్మతల్లి అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవం ఆదివారం వైభవం గా సాగింది. గత నెల 23న ప్రారంభమైన అమ్మవారి జాతర మహోత్సవాలు ఆదివారం నాటి తీర్థంతో ముగిశాయి. తొమ్మిది రోజులపాటు జాతర మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. కోనసీమజిల్లా నుంచే కాకుండా ఉభయగోదావరి జిల్లాల నుంచి కూడా వేలాది మంది భక్తులు అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలను తిలకించి తరలివచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు. తెల్లవారుజాము నుంచే భక్తులు బారులు తీరి అమ్మవారిని దర్శించుకున్నారు. మేకల వంశీయులు అమ్మవారికి స్వయంపాకం సమర్పించి జాతర మహోత్సవాలు ప్రారంభించారు. అమ్మవారిని ఆలయ ప్రాంగణం నుంచి డప్పు వాయిద్యాలు, సన్నాయి మేళాలు, భాజాభజంత్రీలు, గగుర్పాటుకు గురిచేసే శక్తివేషాలు, నాగిని డ్యాన్సులు, కేరళ వాయిద్యాలు, తీన్‌మార్ వాయిద్యాలు, కోయ నృత్యాలు, బుట్టబొమ్మల వేషధారణలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో మిరుమిట్లు గొలిపే బాణాసంచా కాల్పుల నడుమ అమ్మవారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో జరిగే తీర్థ మహోత్సవాల్లో పాల్గొన్న భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు. సుమారు 30వేల మంది భక్తులకు అన్నసమారాధనలో అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందించారు. సత్యసాయి సేవాసమితి సభ్యులు 150 మంది అన్నసమారాధనలో పాల్గొని సేవలు అందించారు. పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహోత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ముమ్మిడివరం సీఐ ఎన్.కొండయ్య ఆధ్వర్యంలో ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం ఎస్ఐలు డి.సురేష్‌బాబు, నాగేశ్వరరావు, భానుప్రసాద్‌లతో వంద మంది పోలీసులతో భారీ బందోబస్తు నిర్వహించారు.



సత్తెమ్మతల్లిని దర్శించుకునేందుకు తరలి వస్తున్న భక్తులు



ఆకట్టుకున్న శక్తివేషాలు

'వైసీపీ చేసిందేమీ లేదు'

జగ్గంపేట, మార్చి 3: యువజన, శ్రామిక, రైతు పేర్లను తగిలించుకున్న వైసీపీ ఆయా వర్గాలకు చేసిందేమీలేదని కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి మరోతి శివగణేష్ ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ షర్మిల నాయకత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అన్ని వర్గాలకు న్యాయం చేస్తామన్నారు. సమావేశంలో పార్టీ నేతలు వత్సవాయి సత్యనారాయణ, నక్కా సత్యనారాయణ, రత్నాజీరావు, కొండా శ్రీను తదితరులున్నారు.

'పవన్‌ని విమర్శించే స్థాయి సూర్యప్రకాశ్‌కు లేదు'

సర్పవరం జంక్షన్, మార్చి 3: దొంగల, దోపిడీదారుల, జైలు పక్షుల పార్టీ వైసీపీ అని విమర్శించావు..టిక్కెట్ రాదనే ఉద్దేశంతో పార్టీ మారడం తప్పులేదు. పార్టీ మారుతూ సీఎం జగన్ ప్రాపకం కోసం పవన్ కల్యాణ్‌ని విమర్శించే స్థాయి నీకు లేదని సూర్యప్రకాశ్‌పై జనసేన పార్టీ కాకినాడ రూరల్ జనసేన-టీడీపీ ఉమ్మడి అభ్యర్థి పంతం నానాజీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం వలసపాకల గంగరాజునగర్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీ తండ్రి హరి రామజోగయ్య గుర్తింపుతో పార్టీలో పీఏసీ సభ్యుడిగా పవన్ అవకాశం కల్పించారన్నారు. దొంగల పార్టీ అన్న నీవు కూడా దొంగవని తేటతెల్లం చేశావని విమర్శించారు. జనసేనలో ప్రజాస్వామ్యం లేదని, ఎటువంటి చర్చ జరగదని విమర్శించడాన్ని ఆక్షేపించారు. నిడదవోలు సీటు కందుల దుర్గేష్‌కు ఖరారవుతుందన్న ఉద్దేశంతో పార్టీ మారిన నీవు ఇలా పవన్‌పై అవాకులు, చెవాకులు మాట్లాడితే ఏమాత్రం ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు కరెడ్ల గోవిందు, శిరంగు శ్రీనివాసరావు, తాటికాయల వీరబాబు, పండు నాయుడు, సోది ముసలయ్య పాల్గొన్నారు.

'ల్యాబ్ టెక్నీషియన్లుగా ప్రమోషన్లు కల్పించాలి'

జీజీహెచ్ (కాకినాడ), మార్చి 3: ఇన్ సర్వీస్ ట్రైనింగ్ పూర్తి చేసుకున్న జీజీహెచ్, ఆర్ఎంసీలో పనిచేస్తున్న సిబ్బందికి తక్షణమే ల్యాబ్ టెక్నీషియన్లుగా ప్రమోషన్లు కల్పించాలని ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏపీఎంఈయూ) రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ బి.స్వామిబాబు కోరారు. కాకినాడలో యూనియన్‌శాఖ అధ్యక్షుడు కె.మోహనరావుతో ఆదివారం డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ వీఎస్‌వీఎల్ నరసింహాన్ని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. జీజీహెచ్‌లో ఇన్‌పేషెంట్ల కోసం గైనిక్ బ్లాక్‌లో ఒక వార్డు ల్యాబొరేటరీ, ఈఎన్‌టీలో మరో ల్యాబ్ ఏర్పాటు చేయాలని కోరారు. జీజీహెచ్‌లో ఉన్న 8 కంప్లీట్ బ్లడ్ పిక్చర్ (సీబీపీ) అనలైజర్స్ ఇప్పించాలని కోరారు. ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని డీఎంఈ హామీ ఇచ్చారు. అనంతరం కాకినాడలో నిర్వహించిన సమావేశంలో యూనియన్ కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షులుగా యు.శ్రీహరిరావు, వైస్ ప్రెసిడెంట్‌గా ఎ.మురళీకృష్ణ, జాయింట్ సెక్రటరీ ఎన్‌వీవీఎస్ రాజు, పి.సురేష్‌బాబు, ట్రెజరర్ ఎస్.జగన్మోహనరావు ఎన్నికైనట్లు తెలిపారు.

'బీసీల అభివృద్ధికి కృషి చేసిన టీడీపీ'

తాళ్లరేవు, మార్చి 3: బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ ఆదరణ పథకం, కార్పొరేషన్‌ల ద్వారా ఎంతో కృషి చేసిందని డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా టీడీపీ బీసీసెల్, బీసీ సాధికార కమిటీ సభ్యుడు వాడ్రేవు వీరబాబు అన్నారు. ఆదివారం తాళ్లరేవు టీడీపీ కార్యాలయంలో జరిగిన బీసీ సెల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 5న మధ్యాహ్నం 2గంటలకు టీడీపీ ఆధ్వర్యంలో మంగళగిరిలో జరిగే జయహో బీసీ కార్యక్రమంలో టీడీపీ అధికారంలోకి రాగానే తీసుకునే నిర్ణయాలను బీసీ మేనిఫెస్టో విడుదల చేస్తారన్నారు. ముమ్మిడివరం నియోజకవర్గంలోని బీసీ సోదరులంతా సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు. బీసీ నేతలు టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగసూర్యనారాయణ, కట్టా త్రిమూర్తులు, జిత్తుక శ్రీనివాసరావు, కుడిపూడి దుర్గారావు, గంజా సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం'

తుని రూరల్, మార్చి 3: టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేద్దామని, అవినీతి అక్రమాలతో పేట్రేగిపోతున్న వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపుదామని తుని టీడీపీ, జనసేన అభ్యర్థి యనమల దివ్య అన్నారు. ఎస్.అన్నవరంలో మీ ఇంటికి మీ దివ్య కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడుతో కలిసి పర్యటించి గ్రామస్తుల సమస్యలు విని భరోసా ఇచ్చారు. యనమల శివరామకృష్ణన్, పోల్నాటి శేషగిరిరావు, సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, చోడిశెట్టి వెంకటేష్, అప్పన రమేష్, వంగలపూడి శ్రీనివాస్, జక్కాన రామునాయుడు తదితరులు ఉన్నారు.

'టీడీపీ అధికారంలోకి వచ్చేందుకు కృషి'

ఏలేశ్వరం, మార్చి 3: వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశాన్ని అధికార పీఠం ఎక్కించేదుకు తామంతా కృషిచేస్తున్నామని టీడీపీ అధికార ప్రతినిధి పైల సుభాష్ చంద్రబోస్ చెప్పారు. ఏలేశ్వరంలో ఆయన స్వగృహంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్లలో వైసీపీ ఎన్నో అక్రమ కేసులు బనాయించినా భయపడకుండా తన అనుచరులు ప్రజల పక్షాన పోరాటం చేశామన్నారు. సమావేశంలో నియోజకవర్గ బీసీ సఘరక్షణ సమితి కన్వీనర్ ఏపూరి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు సతివాడ రాజు, వాగు రమేష్, పైల అయ్యప్ప, ముచ్చి అప్పలరాజు, శిడగం కన్నారావు తదితరులు ఉన్నారు.

రాజా సంస్మరణ సభకు ఏర్పాట్లు పూర్తి

ప్రత్తిపాడు, మార్చి 3: దివంగత టీడీపీ నేత వరుపుల రాజా ప్రథమ సంస్మరణ సభ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయ ఆవరణలో నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో చేపట్టిన ఏర్పాట్లను ఆదివారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వత్సవాయి సూర్యనారాయణ రాజు(మీసాలరాజు), అమలాపురం నియోజకవర్గ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు, టీడీపీ జిల్లా నాయకులు పర్వత సురేష్, యాళ్ళ జగదీష్, ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, మాజీ జడ్పీటీసీ జ్యోతుల పెదబాబు పరిశీలించారు. సోమవారం జరిగే సభకు ప్రజలు తరలిరావాలని కోరారు. రక్తదాన శిబిరం, పేదలకు వస్త్రదానం నిర్వహించనున్నారు. సర్పంచ్ మంతెన శ్రీను, సొసైటీ అధ్యక్షులు చిక్కాల లక్ష్మణరావు, యర్రాబత్తుల గోవిందనాయుడు, ఆనంద న్యూటన్, బ్యాంక్ రాజు, ఇళ్ళ అప్పారావు, కోలా తాతబాబు పాల్గొన్నారు.

200 మందికి చీరల పంపిణీ

ప్రత్తిపాడు, మార్చి 3: ప్రత్తిపాడు నరేంద్రకొండ శ్రీరామనామక్షేత్రం వద్ద సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ యల్లపు బులిరాజు సొంత నిధులతో సమకూర్చిన చీరలు 200 మంది పేదలకు ఆదివారం పంపిణీ చేశారు. సంక్షేమ సంఘం సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా వీటిని యల్లపు బులిరాజు, జిల్లా నాయకులు ముచ్చి అప్పలరాజు, మదినే నూకరాజు మహిళలకు అందజేశారు. నియోజకవర్గంలో ఇండిపెండెంట్ అభ్యర్థిగా రాబోయే ఎన్నికల్లో పోటీ చేస్తామని ప్రజలు ఆశీర్వదించాలని బులిరాజు కోరారు. సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం నాయకులు యడ్ల వీరస్వామి, కట్టమూరి కొండబాబు, ధారా నూకరాజు, సగరపు రాంబాబు, పెండ్యాల శివశంకర్, కేశనకుర్తి శ్రీనివాస్, నల్లమిల్లి నానాజీ, ఒమ్మి వరహాలు పాల్గొన్నారు.

పిఠాపురంలో చోరీలు

పిఠాపురం, మార్చి 3: పట్టణంలో చోరీలు జరిగాయి. మోహననగర్ ప్రాంతానికి చెందిన కొల్లి కన్నయమ్మ ఈనెల 1న పెన్షన్ తీసుకుని కాకినాడ రూరల్ మండలం రాయుడుపాలెంలోని పెద్దకుమారుడి ఇంటికి వెళ్లింది. ఆదివారం తిరిగి వచ్చి చూసుకునే సరికి ఇంటి తాళాలు బద్దలు కొట్టి ఉండడంతో పాటు సామాన్లు అన్ని చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. బీరువాలో ఉండాల్సిన 11 గ్రాముల బంగారు చెయిన్, చెవిదుద్దులు, రూ.55,500 నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పిఠాపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మోహననగర్ ప్రాంతానికి చెందిన ఏకా సింహాద్రి మోటార్‌సైకిల్‌ను శనివారం అర్ధరాత్రి, ఆదివారం తెల్లవారుజాము సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. దీనిపై సింహాద్రి పిఠాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

'మా పసలపూడి కథల కమామీషు' సభ

కాకినాడ రూరల్, మార్చి 3: మానవీయ విలువలను సమర్థవంతంగా రచయిత వంశీ రచించారని ఆదిత్య చైర్మన్ ఎన్.శేషారెడ్డి అన్నారు. కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల్లో కె.రామచంద్రారెడ్డి రచించిన వంశీ మా పసలపూడి కథల కమామీషు పుస్తక పరిచయ సభను ఆదివారం నిర్వహించారు. జె.కృష్ణబాబు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఎన్.శేషారెడ్డి మాట్లాడుతూ వంశీతో తనకు గల అనుబంధాన్ని గూర్చి వివరించారు. కార్యక్రమంలో కవి ర్యాలీ ప్రసాద్, రచయిత అద్దేపల్లి ప్రభు, సాహితీవేత్త పీఎస్‌ప్రకాశరావు, పుస్తకప్రచురణ కర్త సానా వెంకట్రావు, కొండూరు రామరాజు, మార్నిజానికిరామ్‌చౌదరి, గొడవర్తి సత్యమూర్తి గౌరీనాయుడు,సూర్యభాస్కర్ ఉన్నారు.

కాకినాడలో 'యుద్ధానికి మేము సిద్ధం'

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 3: జనసేన పార్టీ సిటీ ఇన్‌చార్జి ముత్తా శశిధర్ నాయకత్వంలో 11వ డివిజన్ నూకాలమ్మగుడి ప్రాంతంలో జంప అప్పలరమణ ఆధ్వర్యంలో యుద్ధానికి మేము సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. కేవలం 889మందికి మాత్రమే ఎమ్మెల్యే పట్టాలు ఇచ్చారని, 2శాతం మాత్రమే ఇళ్ల కట్టుకోవడానికి లోన్లు ఇచ్చారన్నారు. కార్యక్రమంలో అద్దంకి కిషోర్‌కుమార్, చింతా గోపాలకృష్ణ, ప్రసాద్, డేవిడ్, కర్రి సత్యసాయి, వెంకటేష్, సతీష్, శ్రీకాంత్, పెమ్మాడి దుర్గారావు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్ర్కీన్స్: ఆపరేషన్ వాలెంటైన్, భూతద్ధ భాస్కర్, చారి 111, కిక్, ఊరు పేరు భైరవకోన

దేవీ మల్టీప్లెక్స్ 4 స్ర్కీన్స్: ఆపరేషన్ వాలెంటైన్, భూతద్ధ భాస్కర్, చారి 111, కిక్, ఊరు పేరు భైరవకోన

తిరుమల	:	అంబాజీపేట మ్యారేజీబ్యాండు
లక్ష్మి	:	ఆపరేషన్ వాలెంటైన్
సీ అండ్‌సీ1	:	హనుమాన్
సీ అండ్‌సీ2	:	ఆపరేషన్ వాలెంటైన్
శ్రీప్రియ	:	సుందరంమాస్టర్
పద్మప్రియ	:	ఆపరేషన్ వాలెంటైన్
సత్యగౌరి	:	భూతద్దం భాస్కర్
సూర్య 1	:	ఆపరేషన్ వాలెంటైన్
సూర్య 2	:	కిక్

అడ్వకేట్ మృతి

కాకినాడరూరల్, మార్చి 3: ఇంద్రపాలెనికి చెందిన నాగబత్తుల రాజబాబు (64) అనే అడ్వకేట్ అకస్మాత్తుగా ఆయాసం, దగ్గు ఆరోగ్య సమస్యలతో శనివారం అర్ధరాత్రి వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు వెళ్లారు. ఆ సమయంలో అక్కడికక్కడే సొమ్మసిల్లి పడిపోవడంతో మృతిచెందారు. జీజీహెచ్ నుంచి వచ్చిన ఎమ్ఎల్‌సీ రిపోర్టు ప్రకారం కేసు నమోదు చేశామని ఎస్ఐ మణికుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌లో ఉంచామని ఆ నివేదిక ఆధారంగా దర్యాప్తు చేస్తామన్నారు.

విజయవంతంగా పల్స్‌పోలియో

పిల్లలకు పోలియో చుక్కలు వేసిన వైద్యులు, ప్రజాప్రతినిధులు



గొల్లప్రోలులో పోలియో చుక్కలు వేస్తున్న కమిషనరు రవికుమార్



కాకినాడ రూరల్ మండలంలో..



తొండంగి: ఏవీనగరంలో..

పిఠాపురం, మార్చి 3: జిల్లావ్యాప్తంగా ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. పిఠాపురం మున్సిపల్ కార్యాలయంలో కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వాసుపత్రిలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ సుజాత, ఇందిరానగర్ అర్బన్‌హెల్త్ సెంటర్‌లో డాక్టర్ జయరామ్ తదితరులు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమం జరుగుతున్న తీరును మున్సిపల్ కమిషనరు కనకారావు తదితరులు పర్యవేక్షించారు.

గొల్లప్రోలు: పట్టణంలోని పాపయ్యచావిడి వీధి వద్ద గల పల్స్‌పోలియో కేంద్రంలో నగరపంచాయతీ కమిషనర్ రవికుమార్ చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించగా, కౌన్సిలరు గంగ్రేటి శ్రీరామచంద్రమూర్తి, వైద్యాధికారులు డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ సునీత మెర్సీ తదితరులున్నారు.

గొల్లప్రోలు రూరల్: గొల్లప్రోలు మండలం చేబ్రోలులో చిన్నారులకు జడ్పీటీసీ ఉలవకాయల నాగలోవరాజు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైద్యాధికారులు డాక్టర్ తులసీ, డాక్టర్ జగదీష్, ఓరుగంటి ప్రసాద్ పాల్గొన్నారు. పీహెచ్‌సీ పరిధిలో 3,321మంది చిన్నారులకు 3257మందికి పోలియో చుక్కలు వేసినట్లు డాక్టర్ తులసీ తెలిపారు.

తొండంగి: ఏవినగరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి రత్నకుమార్, జిల్లా లెప్రసీ అధికారి ఆర్ రమేష్ పరిశీలించారు. వైద్యాధికారి డాక్టర్ రవికుమార్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందించే విధంగా చూడాలని, నూరుశాతం లక్ష్యం సాధించాలని కోరారు.

పెద్దాపురం: మున్సిపల్ కార్యాలయం వద్ద చైర్‌పర్సన్ బొడ్డు తులసీమంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, కమిషనర్ కేవీ పద్మావతి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కాండ్రకోట, పులిమేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. మిషన్ అన్నపూర్ణ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దేవత రాజేష్ కుమార్ పోలియోసిబ్బందికి భోజన ఏర్పాట్లు చేశారు.

కాకినాడ రూరల్: రూరల్ మండలం తూరంగి పీహెచ్‌సీ పరిధిలో వైద్యాధికారిణి డాక్టర్ వసుంధరాదేవి ఆధ్వర్యంలో పల్స్‌పోలియో నిర్వహించారు. పీహెచ్‌సీ పరిధిలోని 17సచివాలయాల్లో 24 పోలియో కేంద్రాల ద్వారా 6128 మంది పిల్లలకు గానూ 6034 మందికి పోలియో చుక్కలు వేశామని తెలిపారు. పండూరు పీహెచ్‌సీ పరిధిలోని పల్స్ పోలియోకేంద్రాల్లో మొత్తం 8906 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయగా సంబందిత కేంద్రాలను డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ పరిశీలించారు. డాక్టర్ మౌనిక, ఎంపీహెచ్‌ఈవో పీవీప్రకాశరావు ఉన్నారు.

సామర్లకోట: సామర్లకోట ఆర్టీసీ కాంప్లెక్స్ అవరణలో పల్స్ పోలియోను మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావు ప్రారంభించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. పట్టణంలో 34 పోలియో శిబిరాలు ఏర్పాటు చేసినట్టు అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారులు డాక్టర్ ప్రభ, డాక్టర్ సీహెచ్ భవ్యశ్రీ తెలిపారు. కౌన్సిలర్లు సేపేని సురేష్, పాగా సురేష్ కుమార్, పితాని కృష్ణ, రెడ్నం సునీత, శ్రీనివాస్, అడపా సూర్యప్రసాద్ పాల్గొన్నారు. కొత్తూరు సచివాలయ ఆవరణలో శిబిరంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

కరప: కరప ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిసత్తిబాబు, జడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు ప్రారంభించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. పీహెచ్‌సీ పరిధిలోని 3,992మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్టు వైద్యాధికారి రమావత్ శ్రీనివాసనాయక్ తెలిపారు. వేళంగి పీహెచ్‌సీ పరిధిలోని 2,796మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్టు వైద్యాధికారిణి ఎం.క్రాంతిసౌజన్య తెలిపారు.

ఏలేశ్వరం: మండలంలో వైద్యాధికారులు నిర్వహించిన కేంద్రాల్లో 6099 మందికిగాను 5935 మందికి పోలియో చుక్కలు వేశామని వైద్యులు డి.పాపారావు, శ్రీలక్ష్మీ లెలిపారు. మిగిలిన పిల్లలకు సోమవారం, మంగళవారం ఇంటింటికి వెళ్లి వేస్తామన్నారు.

ప్రత్తిపాడు: రాచపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో పల్స్‌పోలియోను ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్ ప్రారంభించారు. పీహెచ్‌సీ పరిధిలో 3412 మందికి పోలియోచుక్కలు వేశారు. వైద్యాధికారి పవన్‌కుమార్, జడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి దొరబాబు, సేంద్రపు భాస్కర్, పినిశెట్టి ప్రకాష్ పాల్గొన్నారు. పెద్దిపాలెం పీహెచ్‌సీలో 1600, శాంతి ఆశ్రమ పీహెచ్‌సీ పరిధిలో 220 మందికి చుక్కలు వేశారు.

రౌతులపూడి: మండల గ్రామాల్లో ఐదేళ్లలోపు పిల్లలకు ఆరోగ్య సిబ్బంది పోలియో చుక్కలు వేశారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: ఆర్టీసీ కాంప్లెక్స్‌లో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సరిత, రాజపూడి పీహెచ్‌సీ డాక్టర్ పూజ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్, లైన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ చైర్మన్ కొత్త కొండబాబు పిల్లలకు పోలియోచుక్కలు వేశారు.

గండేపల్లి: మండలంలో 3402 మందిగాను 3338 మందికి పోలియో చుక్కలు వేసి 98శాతం నమోదు చేశామని డాక్టర్లు సురేంద్ర, హరిత తెలిపారు.

బాలయోగి చిరస్మరణీయుడు

ఘన నివాళులర్పించిన టీడీపీ నేతలు



కాకినాడ సిటీ: బాలయోగి విగ్రహానికి నివాళులర్పిస్తున్న కొండబాబు, టీడీపీ నేతలు

కాకినాడ సిటీ, మార్చి 3: బడుగు,బలహీన వర్గాల ఆత్మబంధువు, కోనసీమ అభివృద్ధి ప్రదాత బాలయోగి చిరస్మరణీయులని మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కొనియాడారు. తొలి దళిత లోక్‌సభ స్పీకర్ దివంగత జీఎంసీ బాలయోగి వర్ధంతి సందర్భంగా జగన్నాథపురం యానాం రోడ్‌లోని బాలయోగి విగ్రహానికి ఆయన ఆదివారం టీడీపీ శ్రేణులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, పలివెల రవి అనంతకుమార్ పాల్గొన్నారు. బాలయోగి వర్ధంతి సందర్భంగా టీడీపీ ఆధ్వర్యంలో పెద్ద మార్కెట్ ఏరియాలోని నారా లోకేశ్ యువజన ఫౌండేషన్ కార్యాలయం వద్ద పేదలకు అన్నదానం చేశారు. బాలయోగి చిత్రపటానికి ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెరుకూరి సాయిరాం వర్మ పూలమాలలు వేశారు.

తాళ్లరేవు: మారుమూల ప్రాంతాల నుంచి పార్లమెంట్ వరకు రాజకీయాలను తీసుకువెళ్లిన ఘనత జీఎంసీ బాలయోగిదేనని టీడీపీ,జనసేన ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు అన్నారు. తాళ్లరేవులో, సుంకరపాలెంలో జీఎంసీ బాలయోగి విగ్రహానికి బుచ్చిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నీలపల్లిలో బాలయోగి విగ్రహాలకు టీడీపీ నేతలు, ఎస్సీ విభాగం నేతలు పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు టేకుమూడి లక్ష్మణరావు, మోపూరి వెంకటేశ్వరరావు, వుంగరాల వెంకటేశ్వరరావు, జక్కల ప్రసాద్‌బాబు, మోర్త భైరవమూర్తి, బోయిడి వేణుగోపాల్, కట్టా త్రిమూర్తులు, వేగేశ్న భాస్కరరాజు, పొన్నమండ రామలక్ష్మి, వెంటపల్లి ఉమామహేశ్వరి, వాడ్రేవు వీరబాబు, మందాల గంగసూర్యనారాయణ, నాగిడి నాగేశ్వరరావు తదితరులున్నారు.

పెద్దాపురం: స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద జీఎంసీ బాలయోగి చిత్రపటానికి ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పదవులకే వన్నె తెచ్చిన గొప్ప వ్యక్తి బాలయోగి అని ఆయన సేవలను కొనియాడారు. టీడీపీ నేతలు రాజాసూరిబాబురాజు, కందుల విశ్వేశ్వరరావు, అడబాల కుమారస్వామి, గవరసాన శివరామకృష్ణ, శింగన అరవింద్‌కుమార్ పాల్గొన్నారు.

పిఠాపురం: లోక్‌సభ మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగి రాష్ట్రం, జిల్లా అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం చేసిన కృషి చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. పిఠాపురం టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి బాలయోగి చిత్రపటానికి వర్మ పూలమాలలేసి నివాళులర్పించారు.

9న ప్రత్తిపాడులో చంద్రబాబు బహిరంగ సభ

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ



సమావేశంలో మాట్లాడుతున్న నెహ్రూ

జగ్గంపేట రూరల్, మార్చి 3: ప్రత్తిపాడులో ఈనెల 9న టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు బహిరంగ సభను విజయవంతం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. జగ్గంపేట మండలం ఇర్రిపాక శివాలయం వద్ద నియోజకవర్గ టీడీపీ విస్తృత స్థాయి సమావేశానికి నెహ్రూ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నెహ్రూ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి, గోకవరం, మండలాల నుంచి 20వేల మంది టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, మహిళలు తరలిరావాలన్నారు. 9న మధ్యాహ్నం 2 గంటలకు సోమవరం గ్రామంలో వేంకటేశ్వర స్వామి ఆలయం వద్దకు చేరుకోవాలని అక్కడ నుంచి బయల్దేరి ప్రత్తిపాడు బహిరంగ సభకు వెళ్లాలన్నారు. ఈనెల12న 12మంది క్లస్టర్లలోని 12 సభలు ఏర్పాటు చేస్తామని, ముందుగా 12న నరేంద్రపట్నంలోని సభ ఉంటుందని నెహ్రూ తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

గోకవరం గ్రామానికి చెందిన వైసీపీకి చెందిన దాసరి తరుణ్ ఆధ్వర్యంలో పలువురు జ్యోతుల నెహ్రూ సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో దాసరి తమ్ముడు దొర, దాసరి తరుణ్, ఎస్వీ అప్పలరాజు, కొత్త కొండబాబు, అడపా తాతాజీ, నకిరెడ్డి రాంబాబు పాల్గొన్నారు.

విధ్వంసకర పాలనకు చరమగీతం పాడాలి

టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల



టీడీపీలోకి ఆహ్వానిస్తున్న యనమల కృష్ణుడు

తొండంగి, మార్చి 3: రాష్ట్రంలో జరుగుతున్న విధ్వంసకర పాలనకు చరమగీతం పాడేందుకు ప్రతి ఒక్కరూ కలిసి రావాలని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు పిలుపునిచ్చారు. ఆదివారం ఒంటిమామిడి టీడీపీ కార్యాలయంలో పెరుమాళ్ళపురం శివారు చింతకాయల పేట గ్రామ వైసీపీకి చెందిన గరికిన లోవరాజు, తిత్తి ఏడుకొండలు, కోడా నూకరాజు, మడదా కనకరాజు, సూరాడ అబ్రహాంతో పాటు భారీ సంఖ్యలో మత్స్యకారులు టీడీపీలో చేరగా వారికి కృష్ణుడు పార్టీ కండవాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధ్వాన్న పరిస్థితులు ఉన్నాయన్నారు. రానున్నది టీడీపీ, జనసేన ప్రభుత్వమేనని కార్యకర్తలంతా ఐక్యంగా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా మత్స్యకార అధ్యక్షుడు కోడ వెంకటరమణ, తెలుగు రైతు రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పేకేటి హరికృష్ణ, మండలాధ్యక్షులు చొక్కా అప్పారావు, మహంకాళి, చొక్కా కాశీశ్వరరావు, డిమురళి తదితరులు ఉన్నారు.

'టాపర్‌గా నిలవడం గర్వకారణం'

జీజీహెచ్ (కాకినాడ), మార్చి 3: ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పరిధిలో ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ ఫలితాల్లో కాకినాడ రంగరాయ వైద్యకళాశాలకు చెందిన ఎ.సాయి అనిరుధ్ యూనివర్సిటీ టాపర్‌గా నిలవడం ఎంతో గర్వకారణమని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం కొనియాడారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఆర్ఎంసీ టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు కాకినాడ జీజీహెచ్ ప్రాంగణంలోని ఎస్‌పీఎం గ్యాలరీలో ఆదివారం ప్రత్యేక అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ నరసింహం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. యూనివర్సిటీ టాపర్‌గా నిలిచిన సాయి అనిరుద్‌ను, మూడోస్థానంలో నిలిచిన పార్వతి, డిస్టింక్షన్ సాధించిన శ్రీలత, రాఘవేంద్రలను వైద్యాధికారుల బృందం పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి సత్కరించారు. సామాజికవేత్త గోకేడ రాంబాబు టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు జ్ఞాపికలు బహూకరించారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ పాల్గొన్నారు.



అనిరుధ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న డీఎంఈ

ప్రజా సమస్యల పరిష్కారంలో వైసీపీ విఫలం

పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ



పిఠాపురంలో కరపత్రాలు అందజేస్తున్న వర్మ

పిఠాపురం, మార్చి 3: ప్రజా సమస్యలను పట్టించుకుని వాటిని పరిష్కరించడంలో వైసీపీ ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ విమర్శించారు. పిఠాపురం 11వ వార్డులో ఆదివారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ, మన ఇంటికి మన వర్మ కార్యక్రమాలను నిర్వహించారు. వర్మ మాట్లాడుతూ టీడీపీ హయాంలో రూ.35కోట్లు వ్యయంతో వాటర్‌స్కీమ్‌ను తీసుకొచ్చి తాగునీటి సమస్యను పరిష్కరించామన్నారు. ప్రస్తుతం ఎక్కడ చూసిన తాగునీరు సక్రమంగా అందడం లేదని, శానిటేషన్ అధ్వానంగా ఉందని, వీధిలైట్లు వెలగడం లేదని ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారని తెలిపారు. వీటిని అధికార పార్టీ నేతలు, అధికారులు పట్టించుకోవడం లేదని చెప్పారు. రానున్న రోజుల్లో పట్టణానికి భూగర్భ డ్రెయినేజీ తీసుకుస్తామని, ప్రజాసమస్యలన్నింటిని పరిష్కరిస్తామని తెలిపారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు రెడ్డెం భాస్కరరావు, నాయకులు దాసం ప్రసాద్, రావుల రవి, పొన్నాడ గంగాభవానీ, కె.పెదబాబు, దేవరపల్లి రామారావు, పిల్లి చిన్నా, కొండేపూడి ప్రకాష్, సోము సత్యనారాయణ, నామా దొరబాబు, మసకపల్లి రాజా, కోళ్ల బంగారుబాబు, అల్లవరపు నగేష్, కొరుప్రోలు శ్రీను, నల్లా శ్రీను ఉన్నారు.

పిఠాపురం రూరల్: పిఠాపురం మండలం పి.తిమ్మాపురంలో శంఖరావం-బాబు సూపర్‌సిక్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ, బాబుతో నేను పిఠాపురం క్యూఆర్ కోడ్ కలిగిన పత్రాలను అందజేశారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ సతీమణి లక్ష్మీదేవి, మాజీ జడ్పీటీసీ బర్ల అప్పారావు, అప్పన్న, టీడీపీ మండలాధ్యక్షుడు సకుమళ్ల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సహకారం

సర్పవరం జంక్షన్, మార్చి 3: ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డులో కాపు కల్యాణ మండపంలో ఆప్టా ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో 2023-24 విద్యా సంవత్సరంలో విద్యలో ప్రతిభ చూపిన 211 మంది విద్యార్థులకు సుమారు రూ.35 లక్షల చెక్కులను అందించారు. అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (ఆప్టా) అల్యుమినీ చైర్‌పర్సన్ ఆకుల శ్రీధర్, బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ సానా వెంకట్ మాట్లాడుతూ అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్న తెలుగువారంతా కలసి ఆప్టా స్థాపించడం జరిగిందన్నారు. 2018 నుంచి పది, ఇంటర్, డిగ్రీ, మెడిసన్ విద్యార్థులకు ఉమ్మడి జిల్లాతో పాటూ తెలుగు రాష్ట్రాల్లోని స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాజీవ్‌గాంధీ విద్యాసంస్థల చైర్మన్ పోతుల విశ్వం, ఆప్టా ప్రతినిధులు సానా నాగేశ్వరరావు, సుంకర ప్రకాశ్, డాక్టర్లు అద్దాల సత్యనారాయణ, కల్యాణ్ చక్రవర్తి, ఎస్వీ రావు, ప్రవీణ్ సానా, సుంకర సుమ, జీఎస్ మూర్తి, పేపకాయల బలరాం, భాస్కర్, రాజా, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. చదువుకునేందుకు సాయం అందించిన ఆప్టా సంస్థ ప్రతినిధులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలుతెలిపారు.

టీడీపీ, జనసేన కూటమిదే విజయం

ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం, మార్చి 2: త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి విజయం సాధించడం తథ్యమని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. ఆయన స్థానిక 19వ వార్డులో ఆదివారం ఎన్నికల ప్రచారాన్ని చేపట్టి మాట్లాడుతూ ఇప్పటికే వైసీపీలో వణుకు ప్రారంభమైందన్నారు. టీడీపీ, జనసేన కూటమిని ప్రజలు ఆదరిసున్నారన్నారు. ఎవరిది అభివృద్ధి పాలనో, ఎవరిది విధ్వసంకర పాలనో ప్రజలు గమనిస్తున్నారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి అనేది మచ్చుకైనా కనిపించడం లేదని వచ్చే ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి తగిన గుణపాఠం చెబుతారన్నారు. టీడీపీ నేతలు రాజా సూరిబాబురాజు, తూతిక రాజు తదితరులు ఉన్నారు.

సామర్లకోట: పెద్దాపురం ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని నిమ్మకాయల చినరాజప్ప కోరారు. సామర్లకోటలో మఠం సెంటర్ వద్ద గల శ్రీరామాలయ, శ్రీవీరభద్రాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పట్టణ ప్రముఖులు పెనుపోతుల సూర్యనారాయణ, సింగవరపు సాయిబాబు, సింగవరపు సత్యనారాయణ, సిద్ధాంతి నోరి కృష్ణారావులను కలిశారు.

'వన్యప్రాణులను సంరక్షించాలి'

తాళ్లరేవు, మార్చి 3: కోరింగ అభయారణ్యంలో వన్యప్రాణులను సంరక్షించే బాధ్యత ప్రతీఒక్కరుపై ఉందని సబ్ జిల్లా అధికారి టి.అనూషా అన్నారు. ఆదివారం ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా చొల్లంగిపేట అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో వన్యప్రాణులపై అవగాహన కల్పించారు. ఎఫ్ఆర్‌వో వరప్రసాద్, సెక్షన్ అధికార్లు ఎమ్.నాగార్జున, ఎమ్‌జీవీ ప్రసాద్, బీటు ఆఫీసర్లు సంధ్యారాణి, గోపినాగేంద్రకుమార్, మహేష్, ధనుంజయరావు ఉన్నారు.

సామూహిక పారాయణం



పిఠాపురం, మార్చి 3: పట్టణంలోని పాదగయ క్షేత్రంలో ఆదివారం సౌందర్యలహరి-శివానందలహరి సామూహిక పారాయణాన్ని నిర్వహించారు. పారాయణంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల మహిళలు పాల్గొన్నారు. కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుతికాఅమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు.

దుర్గమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

గండేపల్లి, మార్చి 3: మురారి గ్రామంలో వెలిసిన కనకదుర్గమ్మ ఆలయం రోజురోజుకు ప్రాముఖ్యత పెరుగుతుంది. ఆదివారం జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించి ఆలయ ప్రాంగణంలో వంటావార్పు చేసుకుని కుటుంబసమేతంగా ఆనందంగా గడిపారు.

చొల్లంగిలో మహిళల నిరసన

తాళ్లరేవు, మార్చి 3: చొల్లంగిలో ఇళ్ల స్థలాలను స్థానికులకే ఇవ్వాలని 33రోజులుగా నిరసనలు తెలుపుతున్నా ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ పట్టించుకోరా అని మహిళలు ప్రశ్నించారు. ఉన్నతాధికారులు స్పందించి స్థానికులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. కార్యక్రమంలో అల్లం లక్ష్మి, మానూరి కుమారి, బొమ్మిడి లోవకుమారి, బొబ్బర వరలక్ష్మి, బూరులు చక్రం, సేకా సత్యవతి, బుంగా ప్రశాంతి, బొడ్డు సంధ్య, వి.రాణి, బొమ్మిడి రాణి, బొడ్డు శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

45 లీటర్ల సారా స్వాధీనం

తుని రూరల్, మార్చి 3: తొండంగి మండలం వేమవరంలో సారా తయారీ స్థావరంపై ఎస్ఈబీ పోలీసులు దాడి చేసి 2800లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 45 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. తమ్మయ్యపేటలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న వ్యక్తి వద్ద 14 బీరు బాటిల్స్ స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్టు ఎస్‌హెచ్‌వో పి.చిట్టిబాబు తెలిపారు.

నేడు 'డయల్ యువర్ కమిషనర్'

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 3: ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ జె. వెంకటరావు తెలిపారు. ప్రజలు స్థానికంగా ఎదుర్కొనే సమస్యలు, ఇబ్బందులను నగరపాలక సంస్థ కార్యాలయం 0884 2357800కు ఫోన్ చేసి తెలియజేయవచ్చన్నారు. 10.30 గంటల నుంచి స్పందన కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందన్నారు.

నేడు బాబా మందిర వార్షికోత్సవం

కరప, మార్చి 3: సిరిపురంలోని షిరిడి సాయిబాబా మందిరం 23వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ ధర్మకర్తలు చిక్కాల దొరబాబు, సుబ్బారావు తెలిపారు. ఉదయం నుంచి స్వామివారికి విశేష పూజాధికాలను నిర్వహించి చందనోత్సవంతో ముగింపు పలుకుతామని తెలిపారు. భారీ అన్నదానం ఏర్పాటు చేసినట్టు, భక్తులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

సీఎం సహాయ నిధి అందజేత

పిఠాపురం, మార్చి 3: నియోజకవర్గంలో ఆరోగ్యకారణాలతో చికిత్సలు చేయించుకున్న 13మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.16.20లక్షలను ఆదివారం పట్టణంలో కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ అందజేశారు.